మొక్కుబడి పనులు

మన ఊరు–మనబడి కింద రూ.72 కోట్లు 176 ప్రభుత్వ బడుల్లో అదనపు గదుల నిర్మాణం, మరమ్మతులకు శ్రీకారం

- ఇప్పటి వరకు పూర్తయింది 30 పాఠశాలల్లోనే..
- పర్యవేక్షణ లోపంతో నత్తనడకన పనులు
- మే నెలాఖరుకు పూర్తి చేయాలన్న కలెక్టర్



సాక్షి, మేడ్చల్ జిల్లా: కార్పొరేట్ స్థాయి విద్య, సౌకర్యాలు కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం 'మన ఊరు – మన బడి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందుకోసం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు రూ.72 వేల కోట్లు కేటాయించింది. ఇంత వరకు బాగానే ఉన్నా పనుల్లో నత్తనడక.. అధికారుల పర్యవేక్షణ లోపంతో పథకం ఉద్దేశం నెరవేరకుండా పోతోంది.

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 505 పాఠశాలలు ఉండగా.. అందులో ప్రాథమిక పాఠశాలలు 375, యూపీఎస్‌లు 22, ఉన్నత పాఠశాలలు 108 ఉన్నాయి. ఈ ప్రభుత్వ బడుల్లో 'మన ఊరు – మన బడి' కింద తొలి విడతలో 176 పాఠశాలలు ఎంపిక య్యాయి. ఇందులో 106 ప్రాథమిక పాఠశాలలు, 6 యూపీఎస్‌లు, 61 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిని కార్పొరేట్ సంస్థలకు దీటుగా ఆధునిక హంగులతో తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే పనులు పూర్తి చేయాల్సి ఉండగా.. అధికారులు పర్యవేక్షణ లోపం, సకాలంలో నిధులు విడుదలకాక జాప్యం చోటుచేసుకుంటోంది.

నాసిరకం ఇసుక, ఇటుకలు..

ఇదే అదనుగా కాంట్రాక్టర్లు స్థానికంగా లభించే నాసిరకం ఇసుక, ఇటుకలను వాడుతూ పనులు చేస్తున్నారు. ఇంత చేసినా.. ఇప్పటి వరకు 30 పాఠశాలల్లో నిర్మాణ, మరమ్మతులు పూర్తిగా, మరి కొన్నింటిలో 60 శాతం పనులు పూర్తయినట్లు జిల్లా విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. వచ్చే మే నెలాఖరు వరకు పనులు పూర్తయ్యేలా కలెక్టర్ అమయ్‌కుమార్ సంబంధిత అధికారుల సమీక్షలతో ఒత్తిడి తెస్తున్నా.. క్షేత్రస్థాయిలో ఫలితం కనిపించడం లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే వచ్చే జూన్‌లో విద్యార్థులు, టీచర్లు కొత్త తిప్పలు పడాల్సి వస్తుందనే ఆందోళన అప్పుడే మొదలైంది.

ఫర్నిచర్, బల్లలు కొన్నింటికే..!

జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో పదుల సంఖ్యలో బడులకే ఫర్నిచర్, గ్రీన్ బోర్డు వంటివి సమకూర్చారు. పట్టణ ప్రాంతాల్లో బడులకు రంగులు వేయడం, టాయిలెట్లు, వంటగదులు, తాగునీటి వసతి పనులు సగం బడుల్లో పూర్తయినా గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అదనపు గదులు, నాణ్యత దేవుడెరుగు.. జరగాల్సిన పనుల్లోనూ ఏమాత్రం వేగం లేదు. మే నాటికి పనులు పూర్తవడం కష్టంగానే కనిపిస్తోంది.

పూర్తయ్యేదెన్నడో..?

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల పరిధిలో అదనపు గదుల నిర్మాణ పనులు ఇంకా జరుగుతున్నాయి. ఈ వేసవిలో గదుల నిర్మాణం పూర్తవడం కష్టమేననిపిస్తోంది. గదులు పూర్తికాకుంటే వానాకాలంలో ఇక్కట్లు తప్పవని పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రామంతాపూర్: సబ్ స్టేషన్ పరిధిలో ఎస్ఎన్‌డీపీ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు తొలగించే ప్రక్రియ జరుగుతున్న కారణంగా శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు లక్ష్మీనారాయణ నగర్, చర్చి కాలనీ, శ్రీరమణపురం, అరవింద్‌నగర్, నేతాజీనగర్, గాంధీనగర్, టీవీ కాలనీ, రాజేంద్రనగర్, బాలాజీనగర్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రాములు తెలిపారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

గౌతంనగర్: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి శనివారం లక్ష్మీసాయి గార్డెన్స్‌లో ఎస్ఆర్ఆర్ జాబ్‌మేళా నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్సీ ఎస్.రాంచందర్‌రావు అన్నారు. నారపరాజు సావిత్రి ఫౌండేషన్, బీఏస్ఎస్ఎఫ్, అన్నావఝ్ఝల చారిటబుల్ ట్రస్ట్, హైర్ ది బెస్ట్ బ్రెయిన్ సంస్థల సౌజన్యంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టెన్త్ పాస్, ఫెయిల్, ఇంటర్, డిగ్రీ, పీజీ, టెక్నికల్, ఇంజినీరింగ్ వారికి ఐటీ, నాన్ ఐటీ, ఫార్మా, విద్యారంగం, తయారీ, హోటల్ మేనేజ్‌మెంట్ తదితర ఉద్యోగాల్లో అవకాశాలు ఉంటాయన్నారు. ఎంట్రీ ఫీజు లేదన్నారు. భోజన వసతి ఉందన్నారు. వివరాలకు ఫోన్: 89784 05740.

మధుర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

మల్లాపూర్: మధుర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు, చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. నాచారం డివిజన్ ఏఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్‌మేళా ఉంటుందని, అవకాశాన్ని ఉప్పల్ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా భగీరథ జయంతి



రామంతాపూర్: సగర సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో భగీరథ మహర్షి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ మాట్లాడుతూ సర్వ మానవాళి సమస్త జీవరాశి కోసం ఒంటి కాలుపై అత్యంత కఠోర తపస్సుతో దివి నుంచి భూమికి గంగను తెచ్చిన భగీరథ మహర్షి మహాత్ముడు అన్నారు. సగర సంగమం అధ్యక్షులు వేముల తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి రమేష్, మన్యం సౌజన్, రామస్వామి, యాదగిరి, పాపారావు, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

పాకశాల నిర్మాణానికి భూమిపూజ

అల్వాల్: ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పాత అల్వాల్‌లోని సీతారామచంద్ర స్వామి దేవస్థానం బహుపురాతన ఆలయానికి గుడి గోపురం, పాకశాల నిర్మించేందుకు గ్రామ పెద్దలు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యుల నిర్ణయం మేరకు గురువారం ఆమె సర్కిల్ అధికారులతో కలిసి భూమి పూజ చేశారు.

విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ



మల్లాపూర్: మల్లాపూర్ రెడ్డి బంధువుల ఆధ్వర్యంలో మల్లాపూర్ ఎలిఫెంట్ చౌరస్తాలో కొత్వాల్ రాజా బహదూర్ వెంకట రామారెడ్డి విగ్రహ ప్రతిష్ఠ పనులకు గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమానికి మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరై పూజ చేశారు. కార్యక్రమంలో మల్లాపూర్ రెడ్డి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షేమ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మృతి



లక్ష్మీనారాయణ (ఫైల్)

రామంతాపూర్: శ్రీనివాసపురం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాంపల్లి లక్ష్మీనారాయణ(62) బుధవారం అర్ధరాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. లక్ష్మీనారాయణ స్థానిక సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘంతో పాటు పలు సంఘాలలో క్రియాశీలక సభ్యుడిగా వ్యవహరిస్తూ సంక్షేమ కార్యక్రమాలు చేపట్టేవారు. ఆయన మృతికి పలు కాలనీల సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు సంతాపం తెలిపారు.

కంటి వెలుగుకు విశేష స్పందన



చీరలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లావణ్యరెడ్డి

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని 9వ డివిజన్ శ్రీనివాస్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి స్పందన లభిస్తుందని 9వ డివిజన్ కార్పొరేటర్ మోదుగు లావణ్య శేఖర్‌రెడ్డి అన్నారు. కంటి వెలుగు కేంద్రాన్ని ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 5 రోజుల్లో 600 మందికి పైగా కంటి పరీక్షలు చేయించుకున్నట్లు వెల్లడించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న మెడికల్ క్యాంపులోని మహిళలకు కార్పొరేటర్ లావణ్యరెడ్డి చీరలు అందజేసి వారిని సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మోదుగు శేఖర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు జానకి రామారావు, ప్రధాన కార్యదర్శి గిరిబాబు, నాయకులు తిరుపతిరెడ్డి, అనిత, చర్ల కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

గౌతంనగర్: ప్రజాసంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ అన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం సాయినగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని కార్తీయనగర్‌లో రూ.80 లక్షలతో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. పనులను జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలంలోపు బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. డీఈ రూప, ఏఈ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, కార్తికేయనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మనస్తాపంతో భర్త ఆత్మహత్య



ఆనంద్ (ఫైల్)

కుషాయిగూడ: మనస్తాపంతో ఓ భర్త ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందిన ఘటన గురువారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. వివరాలు.. ఆర్కేపురానికి చెందిన దండుగుల్ల ఆనంద్(35) రూప దంపతులు. ముగ్గురు పిల్లలతో కలిసి ఆర్నెళ్ల క్రితం కమలానగర్‌కు మకాం మార్చారు. వెల్డర్ వద్ద హెల్పర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి మద్యం మత్తులో ఉన్న మృతుడు ఆనంద్ భార్యతో గొడవ పడ్డాడు. దీంతో ఆమె పిల్లలతో కలిసి మౌలాలిలోని అమ్మవాళ్లింటికి వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన ఆనంద్ ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న ఖైదీ మృతి

కుషాయిగూడ: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ ఖైదీ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. చోరీ కేసులో నిందితుడిగా ఉన్న కనపర్తి సత్యం(38) కరీంనగర్ జిల్లా కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను మెరుగైన వైద్యం కోసం 2 నెలల క్రితం చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. జైలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఖైదీ సత్యం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో 20న గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన కార్డియాక్ అరెస్టు కావడంతో గురువారం తెల్లవారుజామున మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. జైల్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉపేందర్‌యాదవ్ తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయండి



అల్వాల్‌లో పత్రాలు అందజేస్తున్న హరీష్‌రెడ్డి

అల్వాల్: బీజేపీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని బీజేపీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అర్బన్ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి అన్నారు. గురువారం అల్వాల్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కార్తీక్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. అల్వాల్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. పార్టీ బలోపేతానికి జిల్లా పార్టీ ఆధ్వర్యంలో అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా బూత్ కమిటీ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు పరంకుశం మాధవ్, కృష్ణరెడ్డి, జిల్లా మహిళా నాయకురాలు వీణగౌడ్, ఈగ లావణ్య, చింతల మాణిక్‌రెడ్డి, బాబి, మహేందర్‌రెడ్డి, అనిల్, లక్ష్మణ్, సర్వేశ్వరరావు, శేకరాచారి, రాజురి అనిల్, ఆనంద్, రామ్‌సింగ్, నాగి, రవి, గణేష్, రాకేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కరెంటు షాక్‌తో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



ఉమామహేశ్వర్‌రెడ్డి (ఫైల్)

కుషాయిగూడ: ప్రమాదవశాత్తు 11 కేవీ కరెంటు తీగలకు తగిలి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతిచెందిన ఘటన గురువారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చోటు చేసుకుంది. వివరాలు.. మర్రిగూడ పోచమ్మ ఆలయం సమీపంలో ఉండే జానకీరాంరెడ్డి, జ్యోతి దంపతులు కిరాణ షాపు నడుపుతారు. వారికి పాప, బాబు ఇద్దరు సంతానం. పెద్దవాడైన ఉమామహేశ్వర్‌రెడ్డి(21) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ప్రస్తుతం వర్క్ ఫ్రమ్ హోం చేస్తున్నాడు. గురువారం రాత్రి 8:30 గంటల సమయంలో ఇంటి పక్కనే ఉన్న తన మిత్రుడు శశాంక్ ఇంటికి వెళ్లాడు. ఇద్దరూ కలిసి నిర్మాణంలో ఉన్న వారి భవనంపైకి వెళ్లారు. ఉమామహేశ్వర్‌రెడ్డి భవనంపై 11కేవీ కరెంటు తీగలు తాకి కిందపడిపోయాడు. అప్రమత్తమైన మిత్రుడు విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలిపి ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని చెప్పారు. నిర్మాణం జరుగుతున్న భవనంపై తడి కారణంగానో, కరెంటు తీగలకు దగ్గరగా వెళ్లడంతోనో షాక్ తగిలి ఉంటుందని స్థానికులు అంటున్నారు. పోలీసులు వివరాలు సేకరించారు.

వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య

మల్లాపూర్: ఓ మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వి.ధనలక్ష్మీ(32) భర్త రామలింగేశ్వర్‌రావు కూతురు, కుమారుడితో కలిసి మల్లాపూర్ వెంకటరమణ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఛండీయానగర్‌కు చెందిన శివ అనే వ్యక్తి దగ్గర కొంత నగదును ధనలక్ష్మీ, రామలింగేశ్వర్‌రావు తీసుకున్నారు. పలుమార్లు ధనలక్ష్మీని శివ వేధించడంతో గతేడాది నాచారం పోలీసులు కేసు నమోదు చేసి జైలుకు పంపారు. ఇటీవల మళ్లీ ధన్యలక్ష్మీని వేధించడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన చావుకు శివ అనే వ్యక్తి కారణం అని సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

రామంతాపూర్: నారాయణ స్కూల్‌లో గురువారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 5వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు స్కూల్ జీఎం గోపాల్‌రెడ్డి ధృవీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమయపాలన పాటిస్తూ క్రమశిక్షణతో ఉన్నత స్థానాలకు ఎదగవచ్చన్నారు. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఆనందంగా గడపాలని అన్నారు. కార్యక్రమంలో ఏజీఎం బాలపరమేశ్వర్, లక్ష్మి, ప్రిన్సిపాల్ సరిత అగర్వాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కిటికీ గ్రిల్స్ తొలగించి ఇంట్లో చోరీ

అల్వాల్: కిటికీ గ్రిల్స్ తొలగించి ఇంట్లో దొంగతనానికి పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ బేతప్ప వివరాల ప్రకారం రిసాలబజార్ సప్తగిరి కాలనీలో నివాసముండే వాల్జిత్ కటారియా మాజీ సైనిక ఉద్యోగి, ప్రస్తుతం ఎస్‌బీఐలో ఉద్యోగం చేస్తున్నాడు. 23వ తేదీన ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా ఊరికి వెళ్లాడు. బుధవారం రాత్రి ఇంటి కిటికీ గ్రిల్స్ తొలగించిన గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లోని 5 తులాల బంగారు నగలు దొంగతనానికి గురైనట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉదయనగర్ డ్రైనేజీని మా కాలనీకి కలపొద్దు



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న అశోక్‌నగర్ కాలనీవాసులు

బోడుప్పల్: అశోక్‌నగర్‌లో ఎస్ఎన్‌డీపీ పనులు చేపట్టిన తర్వాతే ఉదయనగర్‌లో కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టాలని కోరుతూ గురువారం అశోక్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కమిషనర్ వాణిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. అశోక్‌నగర్ నుంచి వెళ్లే డ్రైనేజీ నిర్మాణం సరిగ్గా లేదని గతంలో కురిసిన వర్షాలకు లోతట్టు కాలనీలు మునిగిపోయాయన్నారు. ఇదే విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఉదయనగర్ కాలనీలో చేపట్టే నూతన డ్రైనేజీని తమ కాలనీలో కలిపితే వర్షాకాలం ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని, ఎస్ఎన్‌డీపీ నిధులతో పనులు చేపట్టిన తర్వాతే మా కాలనీ డ్రైనేజీలో కలపాలని వినతి పత్రంలో కమిషనర్‌ను కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాలనీ అధ్యక్షుడు పసుల అమరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్తయ్య, కోశాధికారి జూదయ్య, ఉపాధ్యక్షులు లింగంగౌడ్, సంజీవ్‌రెడ్డి, శంకర్‌గౌడ్, టీఎస్ మోహత తదితరులున్నారు.

బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న నందికంటి శ్రీధర్

అల్వాల్: బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేసిందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జి నందికంటి శ్రీధర్ అన్నారు. గురువారం హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్ర కార్యక్రమంలో భాగంగా అల్వాల్ డివిజన్‌లోని హరిజనబస్తీ, ఓల్డ్ అల్వాల్ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. మల్కాజిగిరి బీ బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, సీఎల్ యాదగిరి, పవన్, శ్రీపాల్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, జాజుల భాస్కర్, జాజుల హరికుమార్, శ్రీనివాస్, రాజు, మహేష్, మేరీ, పద్మ పాల్గొన్నారు.

ఎర్లీబర్డ్ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఆస్తిపన్ను వసూళ్లపై సమీక్ష సమావేశంలో కమిషనర్ పి.రామకృష్ణారావు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో గురువారం కమిషనర్ పి.రామకృష్ణారావు ఆధ్వర్యంలో ఆస్తిపన్ను వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పన్ను చెల్లింపుదారులకు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ శుభవార్త చెప్పింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్ను ముందస్తుగా చెల్లించే వారికి పన్నురాయితీ కల్పించింది. ఏప్రిల్ 30వ తేదీలోపు ఆస్తిపన్ను చెల్లించే వారికి ఎర్లీబర్డ్ ఆఫర్ వర్తిస్తుందని, ముందుగా ఆస్తిపన్ను చెల్లించే వారికి 5శాతం రాయితీ కల్పిస్తున్నట్లు కమిషనర్ రామకృష్ణారావు తెలిపారు. ఆస్తిపన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాయితీ పొందాలని అన్నారు. ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారం

ఉప్పల్: చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ గురువారం స్థానికులతో కలిసి డివిజన్‌లో పర్యటించారు. గత పర్యటనలో విద్యుత్ స్తంభాల ఆవశ్యకతను గుర్తించిన కార్పొరేటర్ దాదాపుగా 119 విద్యుత్ స్తంభాలను మంజూరు చేయించి వివిధ ప్రాంతాల్లో వేయించారు. ప్రధాన కూడళ్లు, శ్మశాన వాటికలు, బస్తీల్లో, పార్కుల్లో ఈ స్తంభాలు వేయించనున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు తీర్చడంలో ముందుంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్, జగన్, కొండల్‌రెడ్డి, అబ్బు, ముద్దం శ్రీనివాస్, శ్యామ్, బాలు, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.



చిలుకానగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నాట్యాలయ అనన్యరెడ్డి శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అబ్బురపరిచింది. ఆనంద నర్తన, గణపతిమ్, జతిస్వరం, నరసింహ కౌతం, గంధము పూయరుగా, అలవేలుమంగ, యశోద, శివ తాండవం తదితర అంశాలను ప్రణిత, రుత్విక, లావణ్య, మనోన్మనీ, చారని ప్రదర్శించి మెప్పించారు.

ఆక్రమణలను అడ్డుకోవాలి



కాప్రా సర్కిల్ కార్యాలయం ఎదుట శివసాయినగర్ వాసుల ధర్నా

కాప్రా: చర్లపల్లి డివిజన్ శివసాయినగర్ కాలనీలో ఇష్టానుసారంగా రోడ్లను ఆక్రమిస్తూ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలను అడ్డుకోవాలని గురువారం కాప్రా సర్కిల్ కార్యాలయం ఎదుట స్థానికులు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ.. కాలనీలో రోడ్లను ఆక్రమిస్తూ నిర్మాణాలు చేపడుతున్నారని, ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రోడ్లను ఆక్రమిస్తూ, స్థానికులను బెదిరిస్తున్న సదరు బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని సర్కిల్ డీసీ ఎస్.శంకర్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీఎస్ ప్రతినిధి ఎంపల్లి పద్మారెడ్డి, స్థానిక కాలనీవాసులు రాంచంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్, అశోక్, సత్యనారాయణరెడ్డి, రమేష్, దామోదర్‌రెడ్డి, సింహాద్రిరంగారావు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



దెబ్‌రాజ్ మల్లిక్ (ఫైల్)

కుషాయిగూడ: ఓ బాలుడు కనిపించకుండా పోయిన ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఒడిస్సాకు చెందిన లాలు మల్లిక్ కొంతకాలం క్రితం భార్య, పిల్లలతో కలిసి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చాడు. ఓ కాంట్రాక్టరు వద్ద కూలీ పనిచేసుకుంటూ చిన్నచర్లపల్లిలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 24న భార్యతో కలిసి కూలిపనికి వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో ఇంటికి వెళ్లిన సమయంలో వారి పెద్ద కొడుకు దెబ్‌రాజ్ మల్లిక్(13) ఇంటి వద్దే ఉన్నాడు. సాయంత్రం పని ముగించుకొని ఇంటి వెళ్లగా కొడుకు కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన వారు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఈ నెల 25న పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎన్ఆర్ఈసీలో గ్లోబల్ ఎడ్యుకేషన్ సమ్మిట్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి కళాశాలలో గురువారం గ్లోబల్ ఎడ్యుకేషన్ సమ్మిట్ నిర్వహించారు. సైన్ ఇమ్మిగ్రేషన్ సర్వీస్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మిట్‌లో పాల్గొన్న సైన్ ఐఎమ్మెస్ ఆపరేషన్స్ హెడ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లాలనుకునే పేద విద్యార్థులకు తమ సంస్థ ఎలాంటి ఫీజు తీసుకోదన్నారు. పేద విద్యార్థులకు సంస్థ సేవలు అందిస్తోందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ లోకనాథం మాట్లాడుతూ ఇలాంటి సమ్మిట్స్ విద్యార్థులకు లాభదాయకమని, విదేశాల్లో విద్య అభ్యసించే విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలతో అవగాహన పెరుగుతుందని తెలిపారు. సమ్మిట్‌లో యూఎస్ఏ, జర్మనీ, దుబాయ్, మాల్టా దేశాలకు చెందిన 25 యూనివర్సిటీల ప్రతినిధులు పాల్గొని ఆయా యూనివర్సిటీలో ప్రవేశాల దరఖాస్తు విధానం, ఎలా వెళ్లాలి..? వివరించారు. సమ్మిట్‌లో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, సంస్థ ప్రతినిధి వీరేంద్రనాథ్, వివిధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.